క్లుప్తంగా

ఎంపీ కావ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు



జఫర్‌గఢ్: తీగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హనుమకొండలో వరంగల్ ఎంపీ కడియం కావ్యను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోనె జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు గోనె సంధ్యారాణి రాజేష్, నాయకులు గడ్డం రవీందర్, ఎల్మకంటి స్వామి, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 6, 7వ తరగతిలో, జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లోని ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లను తీసుకోనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఇప్పటివరకు చదివిన మెమో, ఆధార్‌కార్డు, సంబంధిత సర్టిఫికెట్లతో పాఠశాలలో నిర్వహించే స్పాట్‌కు హాజరు కావాలన్నారు. అర్హత కలిగిన వారికి వెంటనే సీటు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో విద్యార్థినులకు హాస్టల్ వసతి కూడా ఉందన్నారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి 99519 72225 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రీడా పాఠశాలకు మండల స్థాయిలో ఎంపిక



మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు

జనగామ రూరల్: తెలంగాణ క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశానికి మండల స్థాయి ఎంపిక నిర్వహించినట్లు మండల నోడల్ అధికారి వంగాల రాజేందర్ తెలిపారు. శనివారం పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో మండల స్థాయిలో నలుగురు విద్యార్థులు ఎంపిక అయ్యారని చెప్పారు. లోకేశ్వర్‌రెడ్డి, చెరుకు జగదీష్, షాడ శ్రేష్ఠ, కొత్తకొండ కృతికలు ఈనెల 29వ తేదీ జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నరేందర్, మనోజ్‌కుమార్, రవికుమార్, హనుమంతారావు, సుశీల, జ్యోతి, కుమార్, కిషన్, మాధవి పాల్గొన్నారు.

రేపు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

జఫర్‌గఢ్: క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలను ఈ నెల 24న నిర్వహించనున్నట్లు మండల నోడల్ ఆఫీసర్ ఎండీ పర్వేజ్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు క్రీడా పాఠశాలలో ఎంపిక కోసం తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలకు హాజరుకావాలని పేర్కొన్నారు. విద్యార్థులు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల పరుగు, 6+10 మీటర్ల షటిల్ రన్ మెడిసిన్ బాల్‌త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటి టెస్ట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు 2, వాటర్ బాటిల్, మధ్యాహ్నం భోజనం తీసుకొని రావాల్సిందిగా వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరుప్పుల: మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పంతం అచ్చయ్య కుమారుడు రాజేంద్రప్రసాద్ గుండెపోటుతో మృతిచెందాడు. కాగా, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు రాజేంద్రప్రసాద్ మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాసారపు ధర్మారెడ్డి, పాండు కృష్ణ, యాకస్వామి, గణేష్, రాంబాబు, లీనారెడ్డి, సత్యనారాయణ, రాజేందర్, అనిల్‌కుమార్, రమేష్, వెంకన్న, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు



నోట్ బుక్స్ అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ వరలక్ష్మి, జగదీష్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని ఎంపీపీ మేకల వరలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఇబ్రహీంపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఆమె జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్‌రెడ్డితో కలిసి వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శాంతికుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జగదీష్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. విద్యతోనే బంగారు భవిష్యత్ అని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. గ్రామ ఉన్నత పాఠశాలకు తన వంతుగా మధ్యాహ్న భోజనానికి గ్యాస్ సిలిండర్ ఖర్చు, కంప్యూటర్ అందజేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు దాతలు సాయం చేసి ప్రోత్సహించాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పోకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాసర్ల లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సింహ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్, నాయకులు దొరగొల్ల యాదగిరి, చింత నరేష్, ఎండీ యాకూబ్, మేడిపల్లి నరేష్, పులి కార్తీక్, షబ్బీర్, దొరగొల్ల గట్టయ్య, ఎండీ గౌస్‌మియా, నర్సింగం, పోశెట్టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరితహారం చెట్ల తొలగింపు



తొలగించిన చెట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఈసీ

తరిగొప్పుల: అంతరించిపోతున్న అడవుల శాతాన్ని పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి మొక్కల సంరక్షణకు కృషిచేస్తోంది. అందులో భాగంగా గ్రామాల్లో రోడ్డు వెంట మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం జరుగుతోంది. మండలంలోని అంకుషాపూర్, మాన్‌సింగ్ తండా శివారులో బీటీ రోడ్డుకు వెంబడి ఉపాధిహామీ పథకంలో భాగంగా నాలుగు సంవత్సరాల క్రితం నాటిన మొక్కలు నేడు నీడనిచ్చే చెట్లుగా మారాయి. అలాంటి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు డోజర్ సాయంతో శనివారం తెల్లవారు జామున తొలగించారు. అంకుషాపూర్ నుంచి శివులపల్లి మీదుగా మాన్‌సింగ్ తండాకు వెళ్లే మార్గంలో బీటీ రోడ్డుకు ఇరువైపులా వాహనదారులకు నీడనిచ్చే చెట్లను నరికివేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2 కిలో మీటర్ల పొడవున 200 పైగా మొక్కలకు డోజర్‌తో తొలగించడం జరిగింది. మొక్కలు నాటి, వాటి సంరక్షణ చూసుకోవడానికి లక్షలు వెచ్చించి నాలుగు సంవత్సరాలుగా మొక్కలు పెరిగేందుకు నిత్యం నీటి సరఫరా, ట్రీగార్డుల ఏర్పాటు, ఎంతో శ్రమించి చెట్లను పెంచితే చెట్లను తొలగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఈసీ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి రవీందర్ చెట్లు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఈసీ లింగయ్య తెలిపారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్‌సీసీ తెలంగాణ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు సాధించినట్లు ఏఎన్‌ఓ శాంతి తెలిపారు. పాఠశాలకు చెందిన వరుణ్‌సందేశ్, శ్రీగణేష్, వర్షిత పోస్టర్ మేకింగ్, స్లోగన్ రైటింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వరంగల్ భద్రకాళి బండ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

చిల్పూరు: శ్రీపతిపల్లికి చెందిన హనుమాన్ ఆలయ అభివృద్ధి దాత, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మాలోత్ రాజు గ్రామ సమీపంలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో సొంత ఖర్చులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ ఆలయాన్ని భక్తులకు సౌకర్యంగా ఉండేలా అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బచ్చన్నపేట: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బచ్చన్నపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండలంలోని ప్రధాన చౌరస్తాలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం ఎన్నికల సమయంలో అన్నదాతలకు ఇచ్చిన హామీ మేరకు ఒక్కో రైతుకు రూ. 2లక్షల రుణ మాఫీ చేయనున్నట్లు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సీఎం మాట తప్పని నాయకుడని, రాష్ట్ర ప్రజల సంక్షేమార్థం మరిన్ని పథకాలను అమలు చేయనున్నారని తెలిపారు. నాయకులు పిన్నింటి నారాయణరెడ్డి. జంగిటి నరేష్, మహిపాల్‌రెడ్డి, బాలకిషన్ గౌడ్, రాజిరెడ్డి, మాసపేట రవీందర్‌రెడ్డి, గిద్దెల రమేష్, చెరుకూరి శ్రీనివాస్, వంచ వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి, అయిలుమల్లయ్య, క్రాంతి, బాల్‌రాజు, సిద్దిరాములు, సిద్దులు, మహేందర్, శ్రీను, నరేష్, సందీప్, కర్ణాకర్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడమే కాంగ్రెస్ నైజం

కొడకండ్ల: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ నైజమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేస్తుందని, 48 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.31 వేల కోట్ల రుణమాఫీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన దానికి ప్రభుత్వం కట్టుబడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రుణమాఫీ చేస్తుందని, రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలుస్తుండటంతో అన్నదాతలు హర్షం తెలుపుతున్నట్లు ఆయన చెప్పారు.

‘బ్యాంకు’ను తరలించొద్దు


- అడ్డుకుంటామంటున్న ఖాతాదారులు



సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్


బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ని వేరే భవనంలోకి తరలించొద్దని ఖాతాదారులు కోరుతున్నారు. బ్యాంకులో 30 గ్రామాలకు చెందిన 40 వేల మంది, 550 మహిళా సంఘాల సభ్యులు 6 వేల మంది ఖాతాలు కలిగి ఉన్నారు. రోజుకు బ్యాంకునకు వందలాది మంది ఖాతాదారులు వచ్చి వెళ్తుంటారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బ్యాంకు తరఫున బీసీ పాయింట్లను కూడా ఏర్పాటు చేశారు. మహిళలు, రైతులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, పింఛన్ దారులు బ్యాంకులో ఖాతాలు కలిగి ఉన్నారు. బ్యాంకులో లాకర్ సౌకర్యం కూడా ఉండడంతో చాలా మంది విలువైన పత్రాలు, బంగారం తదితర వస్తువులను భద్రపరుచుకుంటున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు తెచ్చినా, తీసుకున్నా చౌరస్తాలో బ్యాంకు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల బ్యాంకును వేరే భవనంలోకి మార్చాలని టెండర్లు పిలువడంతో కొందరు టెండర్లు వేశారు. పట్టణానికి దూరంగా భవనం ఉన్న వ్యక్తికి ఈ టెండర్ దక్కింది. నూతన భవన నిర్మాణం కూడా సదరు వ్యక్తి చేపట్టాడు. కానీ పట్టణానికి దూరంగా బ్యాంకు కార్యకలాపాలు నిర్వహిస్తే సదుపాయాలు లేక ఖాతాదారులు ఇబ్బంది పడుతామని ఖాతాదారులువాపోతున్నారు. ఇప్పటికైనా బ్యాంకు తరలింపును నిలిపివేసి పాత భవనంలోనే కొనసాగించాలని కోరుతున్నారు.

వేరే చోటకు తరలిస్తే ఇబ్బంది అవుతుంది..



బ్యాంకులోని ఖాతాతో పలు రకాల లావాదేవీలు చేస్తున్నాను. గ్రామం నుంచి ఏ వాహనంలో వచ్చినా ప్రధాన చౌరస్తాలో బ్యాంకు అందుబాటులో ఉంది. బ్యాంకును పట్టణానికి దూరంగా వేరే చోటికి తరలిస్తే అక్కడ రక్షణ కరువవుతుంది. అక్కడ ఎలాంటి వసతులు కూడా లేవు. - నాగరాజు, రామచంద్రాపూర్

అధికారుల నిర్ణయం మేరకే నడుచుకుంటాం..



బ్యాంకు తరలింపునకు అధికారులు టెండర్లు పిలువగా ఓ వ్యక్తి దక్కించుకున్నారు. బ్యాంకు తరలింపు విషయంలో పై అధికారుల నిర్ణయం మేరకే నడుచుకుంటాం. టెండర్లు పిలిచే సమయంలో బ్యాంకును తరలించకూడదని పై అధికారులకు తెలియజేస్తే బాగుండేది.

- శివశంకర్, మేనేజర్, సెంట్రల్ బ్యాంకు

బాధిత కుటుంబాలకు పరామర్శ



స్టేషన్‌ఘన్‌పూర్: పూలమాల వేస్తున్న నాయకులు



గోపాల్‌ను పరామర్శిస్తున్న సుభాష్



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామానికి చెందినర బుర్ర అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల సారంగపాణి శనివారం మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2వేల సాయం అందించారు. సంతాపం తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు మాదిరెడ్డి రాఘవరెడ్డి, చేపూరి ప్రభాకర్, ఐలపాక శ్రీనివాస్, చేపూరి రాజశేఖర్, మహేష్, పొన్న రాజేష్ ఉన్నారు.

తాటికొండలో..

మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన రిపోర్టర్ నారబోయిన గోపాల్ ఇటీవల అనారోగ్యానికి గురై హనుమకొండ రోహిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ శనివారం పరామర్శించారు. ఆస్పత్రిలో గోపాల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సలహాల మేరకు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో మృతి చెందిన మేడోజు చెంద్రయ్య కుటుంబ సభ్యులకు సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ ఆర్థిక సాయం అందించారు. శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ. 5వేలను అందించారు. నాయకులు వంచ వెంకట్‌రెడ్డి, నర్సయ్య, మహాత్మాచారి, చిన్న రామస్వామి, మహిపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గుత్తి సిద్దిరాములు, కనుకయ్య, ఇస్తారి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపల్లిలో..

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మృతి చెందిన గర్జకుంట ఎల్లమ్మ కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ తాతిరెడ్డి భవానిశశిధర్‌రెడ్డి పరామర్శించి రూ. 5వేల సాయం అందజేశారు. బంగారు మల్లయ్య, గుడ్ల ఆనందం, బాబు, బిక్షపతి, రవి, శేఖర్ పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

రఘునాథపల్లి: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని మాజీ జెడ్పీటీసీలు, కాంగ్రెస్ నాయకులు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మారుజోడు రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాసర్ల లక్ష్మయ్య తన వర్గీయులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో జగదీష్‌చందర్‌రెడ్డి, రాంబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర సహకారంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎంపీపీ మేకల వరలక్ష్మి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పోకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాసర్ల లక్ష్మయ్య, నాయకులు దొరగొల్ల యాదగిరి, చింత నరేష్, ఎండీ యాకుబ్, మేడిపల్లి నరేష్, పులి కార్తీక్, షబ్బీర్, దొరగొల్ల గట్టయ్య, ఎండీ గౌస్‌మియా, గ్యార నర్సింగం, మాటూరి పోశెట్టి, కాసర్ల యాదగిరి, మదార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



జనగామ రూరల్: ఏరువాక పౌర్ణమి సందర్భంగా సేంద్రియ పద్ధతులతో మొక్కలను నాటి సంరక్షిస్తున్న కేయూ ప్రొఫెసర్ భాస్కర్‌ను శనివారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణి భాస్కర్‌ను కలిసి మండలంలోని సిద్దెంకి గ్రామంలో వివిధ దేశాల నుంచి తీసుకొచ్చిన 150 రకాల మొక్కలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఆర్గానిక్ పద్ధతిలో ఫామింగ్ చేయాలని భాస్కర్ కోరారు. భవిష్యత్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులకు ఆదరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నరేష్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

పాలకుర్తి: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ఆదివారం పార్టీ కార్యాలయానికి రానున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అనంతరం తొర్రూరులో మధ్యాహ్నం 3 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన మలుపు



ప్రమాద సూచిక లేని వంతెన మలుపు

దేవరుప్పుల: జనగామ-పాలకుర్తి రహదారిలో కోలుకొండ వాగుపై ఉన్న వంతెనకు ఇరువైపులా వాహనదారులకు ప్రమాదపు నివారణ సూచికలు లేకపోవడంతో నిత్యం ప్రాణాపాయ స్థితి నెలకొంది. కోలుకొండ గ్రామం నుంచి జనగామ వైపు వెళ్లేందుకు వంతెనకు చేరే క్రమంలో మలుపు వద్ద వాహన వేగపరిమితి తగ్గేందుకు కనీస నివారణ చేపట్టలేదు. దీంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడంతో క్షతగ్రాతులుగా మారి ఆస్పత్రుల పాలవుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన గడ్డం సమ్మయ్య



దేవరుప్పుల: వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని శనివారం హనుమకొండలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత సమ్మయ్యను అభినందించి శాలువాతో సత్కరించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రేమలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో డ్రెయినేజీ అస్తవ్యస్తం



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. గ్రామంలో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుండగా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. డ్రెయినేజీలు శిథిలం కావడంతో మురుగునీరు రోడ్డుపై పారుతుండగా ప్రజలు దుర్వాసనతో అవస్థల పాలవుతున్నారు. గతంలో గ్రామంలో పలువురు డెంగీ తదితర వ్యాధుల బారిన పడినా పంచాయతీ అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ డ్రెయినేజీల సమస్యల్ని పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేక అధికారి డ్రెయినేజీల విషయమై స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ చోరీ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని గొల్లోని బాయి పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్‌ను చోరీ చేసిన సంఘటన శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఉదయాన్నే వ్యవసాయ బావుల వద్దకు వచ్చిన రైతులు మోటార్ల కేబుల్ వైర్లు దొంగిలించి ఉండటాన్ని గుర్తించి ఆందోళనకు గురయ్యారు. కందుల అనిల్‌కుమార్, మరికకల వెంకటయ్య, కడారి ఆంజనేయులు, కుమార్, చెరుకు శ్రీనివాస్, మడిపోజు బ్రహ్మచారి, వై కుమార్‌గౌడ్ బోరు మోటార్ల వైర్లు దొంగలించారు. నెల రోజుల వ్యవధిలోనే దాదాపు 30 మంది రైతుల బోరు మోటార్ల కేబుల్ చోరీ చేశారని బాధితులు వాపోయారు. కేబుల్ దొంగలించడంతో బోరు మోటర్లకు తిరిగి అమర్చేందుకు వేలాది రూపాయలు అవుతుండంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దుండగులను గుర్తించాలని బాధిత రైతులు కోరుతున్నారు.